కథ

# దేవుడితో బేరం

## దేవుడితో మనిషి బేరం:

శ్రీవేంకటేశ్వరస్వామి గుడి మెట్ల మీద కూర్చుని అడుక్కుంటున్నాడు ఎంకటయ్యా, శని వారం భక్తులకు ప్రియమైన రోజు కనుక జనం బాగానే వస్తున్నారు.

తన ముందు పరిచిన నల్లటి తెల్ల తువ్వాల మీద ఆరోజు చిల్లర డబ్బులు కొంచెం ఎక్కువగానే పడటం చూసి అతని ముఖం కొంచెం కళకళలాడినా, తన అవిటి తనాన్ని చూపిస్తే ఇంకా ఎక్కువ చిల్లర రాలే అవకాశం వుంది కనుక, తన కుష్టుకాలిని అందరికీ స్పష్టంగా కనప డేటట్టు కొంచెం ముందుకు నెట్టాడు ఎంకటయ్య.

అతని కాలి మీద పుండుని చూసి ముక్కుకి జరీ అంచుని అడ్డంగా పెట్టుకుని గబగబా ముందుకి నడి చింది ఒక పట్టుచీర పిన్నిగారు. అయినా ఎంకయ్య మాత్రం ఆ మార్కెటింగ్ టెక్నిక్ రోజూ పనిచేస్తున్నదే కనుక తన కాలుని వెనక్కి తీసుకోలేదు.

గబగబా గుడికేసి వెడుతున్న పట్టుచీర పిన్నిగారు మాత్రం ''ఈ సంబంధం ఖాయం చేయి స్వామీ. అమ్మా యినీ అల్లుడ్నీ పెద్ద తిరుపతికి తీసుకువచ్చి ఘనంగా కళ్యాణం చేయిస్తాం'' అని దేవుడితో బేరం పెడుతు న్నది.

అవిడ వెనకాలే వెడుతున్నాడు శ్రీధర్ ''ఈసారయినా సన్నీ ఎంసీఏ పరీక్షలో గట్టె క్కించు గురూ. పది కొబ్బరికాయలు కొడతాను. అమెరి కాకి వెళ్ళే అవకాశం ఇప్పిస్తే ఇంకో వంద కొబ్బరికా యలు అదనంగా కొడతాను'' మనసులో దణ్ణం పెట్టుకు న్నాడు.

''అరటిపళ్ళు రెండు డజన్లు కొంటాను ఎంతకిస్తా వేంట్'' బేరం పెడుతున్నాడు సీతారామయ్య.

''కిట్టదు బాబూ. మీరు ఎన్ని డజన్లు కొన్నా నాకు మిగిలేది అర్ధరూపాయేనండి. మీతో అబద్ధాలేటండీ. అందులోనూ దేవుడిముంగల''

''మరీ దేశంలో అరాచకం పెరిగిపోయిందయ్యా'' రెండు అరిటిపళ్ళు మాత్రమే కొని గుళ్ళోకి వెళ్ళాడు సీతా రామయ్య.

''బాంకు డబ్బులు దొంగిలించిన ఈ కేసులోనించి బయటపడితే ఈసారి నిజంగా రెండు డజన్ల అరిటి పళ్ళు సమర్పించుకుంటాను స్వామీ'' అందామనుకుని కళ్ళు మూసుకోగానే తెలుగు పౌరాణిక సినిమాలో ఎన్టీ వోడి వేషంలో దేవుడు కనపడి ''నాదాకా ఎందుకురా అగ్గానుడా! ఆ ముడుపేదో ఆ జడ్జికే సమర్పించుకుంటే నీ పని తొందరగా అవుతుంది కదా'' అన్నాడు.

ఆ అప్రాచ్యపు లంచగొండి మాటలు రాముడన్నాడో దేవుడన్నాడో అర్ధం చేసుకోలేక సీతారామయ్య ఒక్క క్షణం ఆలోచించి ''రెండు డజన్ల అరిటిపళ్ళకు చౌకగా పనిచేసి పెట్టే జడ్జీలు ఈ కాలంలో ఎక్కడున్నారు. ఏకాలం వాడివయ్యా'' అని స్వగతంలో అనుకుని పైకి మాత్రం ''ఆ లంచాల మార్గం కన్నా నీ భక్తిమార్గమే మంచిదని నీ దగ్గరికి వచ్చిన అల్పుడినయ్యా! నన్ను ఈ ఊబిలోంచి బయటపడేయ్. నీ సంగతి నేను చూసుకుం టాను'' అన్నాడు రెండు డజన్ల అరిటిపళ్ళతో సరిపె డుతూ.

## మనిషితో మనిషి బేరం:

తిరుమల కొండమీద గర్భగుడి దగ్గర నించీ బయ ల్దేరి తాచుపాములా మెలికలు తిరిగివున్న క్యూలో, వెయ్యి మంది తర్వాత నీరసంగా నుంచుని వున్నారు మోహన్, శ్యామల, వాళ్ళ ఇద్దరు పిల్లలు.

పెద్దవాడు తిలక్ ముఖంలో అలసట, విసుగు కనిపిస్తున్నది. అయినా మాట్లాడ కుండా దిక్కులు చూస్తూ, ఒంటికాలు మీద నుంచు న్నాడు. రెండోది ఈశ్వరి కారుతున్న ముక్కుని ఖాతరు చేయకుండా గొంతెత్తి శ్రావ్యంగా ఏడుస్తున్నది.

శ్యామల ఎవర్ని తిడితే ఊరుకుంటారా అని కోపంతో చుట్టూ చూసి అలాటి వారెవరూ కనపడనందున ఈశ్వరి వీపుమీద చటుక్కున రెండు దెబ్బలు వేసింది.

అప్పటిదాకా శ్రావ్యంగా వినిపిస్తున్న ఏడుపు, ఆరో హణలో తారాస్థాయికి చేరుకుంది. మోహన్ మాత్రం నిర్లి ప్తంగా సమాధిలోకి వెళ్ళిన సంతరావూరు స్వామిలా మౌనంగా వున్నాడు.

అప్పుడే వచ్చాడు నల్లటి గారపళ్ళ పళనియప్పన్.

మోహన్ని చూసి నవ్వాడు. ''ఎందుకుసార్! పిల్లలతో అంత కష్టపడతారు. మిమ్మల్ని పది నిమిషాల్లో లోపలికి తీసుకుపోయేదా'' అన్నాడు.

శ్యామల ముఖం వికసించింది.

సాక్షాత్తూ వెంకన్నే అలా మారువేషంలో వాళ్ళకి సహాయం చేయటానికి వచ్చాడేమోనని ఆమెకు ఒక్క క్షణం అనిపించింది కూడాను.

''పదండి ముందుకు పోదాం. పోదాం'' అన్నది.

''ఎక్కడికి. అతను నీకు సహాయం చేయటానికి రాలేదు. ఇది తిరపతి! తెలుసా'' అన్నాడు మోహన్.

''అదేమిటి సార్! దైవదర్శనానికి వచ్చి అలా అంటారు. మిమ్మల్ని అటు పక్కనించి నేను లోపలికి తీసుకు వెడతాను. మీకూ వెంటనే దర్శనమయిపో తుంది. పిల్లలకీ సుఖంగా ఉంటుంది. మీకు తోచిందేదో ఇవ్వండి. భగవత్ ప్రసాదమనుకుంటాను.''

అక్కడ బల్లలేకపోయినా, బల్లకింద పనులంటే కిట్టని మోహన్ ''అక్కర్లేదు వెళ్ళు'' అన్నాడు చిరుకోపంతో.

అతను నవ్వి ''ఈ మాత్రం దానికే కోపమెందుకు సార్. నేనేమన్నా లక్షలడిగానా కోట్లడిగానా. ఎన్నో వేలు ఖర్చుపెట్టుకుని ఇక్కడికి వచ్చే మీలాటి వాళ్ళకి ఈ పదీప రకా ఒక లెఖ్ఖా. ఇది రోజూ స్వామివారి సన్నిధిలో జరి గేదే. దేవుడికి ఇచ్చిన నైవేద్యం ఆయన నిజంగా తింటాడా. అలాగే ఇదీనూ'' అన్నాడు తను తన సేల్స్‌మ న్‌షిప్ చూపిస్తూ.

జరుగుతున్నది అర్ధం చేసుకున్న శ్యామల ''దేవుడి ముందరే ఇలా లంచాలు తీసుకోవటం పాపం కాదూ'' అన్నది మోహన్‌తో.

మోహన్ నెమ్మదిగా అన్నాడు ''వీళ్ళకి దైవభక్తి లేదు. అందుకే గర్భగుడి దగ్గర ఈ దోపిడీ''

ఎంత నెమ్మదిగా అన్నా పళనియప్పన్‌కి వినపడిన ట్టుంది. చిన్నగా నవ్వి అన్నాడు. ''సార్! అది నిజంగా పాపం అయితే నాకెంత పాపం వస్తుందో నాకు డబ్బు లిచ్చే వాళ్ళకి కూడా అంతే పాపం వస్తుంది కదా. డబ్బులు తీసుకుంటున్న నాకు దైవభక్తి లేదన్నారు. మరి ఇచ్చేవాళ్ళకి ఉందా సార్! వాళ్ళకి దైవభక్తి లేకపోతే అంత డబ్బు ఖర్చు పెట్టుకుని తిరపతి ఎందుకు వస్తారు సార్''

శ్యామలకు అతని వాదన సబబుగానే ఉందనిపిం చింది.

మోహన్ కొంచెంసేపు ఆలోచించి, పెళ్ళాం పిల్లలతో కలిసి పళనియప్పన్ వెనకనే దైవదర్శనానికి బయల్దే రాడు.

★ ★ ★

గుంటూరు గాంధీ పార్కులో శివలింగం వెలిసిందని చెప్పి పాతఖైదీ కన్నయ్య శివలింగం చుట్టూ తాడు కట్టే శాడు. అతను చెప్పింది పదిమందికే అయినా మధ్యాహ్నా నికల్లా వందమంది జనం వచ్చారు. అక్కడ ఒక గుండ్రటి రాయి వుంది.

అంతకు ముందు రాత్రి శివుడు కన్నయ్య కలలో కన పడి, తాను గాంధీ పార్కులో వెలుస్తాననీ, పొద్దున్నే అక్క డికి రమ్మనీ చెప్పాడుట. అతనక్కడికి రాగానే శివలింగం వెలిసిందనీ, శివుడు తననే ధర్మకర్తగా వుండమని చెప్పా డనీ చెబుతున్నాడు.

కొంతమంది అప్పుడే శివలింగం మీద పాలు పోస్తు న్నారు. అక్కడ వున్న అందరికీ ఆశ్చర్యమేసిన విషయం ఏమిటంటే ఆ శివలింగం నిజంగా పాలు తాగుతున్నది.

జనం పాలు పళ్ళే కాకుండా డబ్బులు కూడా ఇస్తు న్నారు.

''అది శివలింగం కాదు. మొన్ననే పార్కులో ఆ గుండ్రాయి ఒక మూల పడి వుంటే చూశాను'' అంటు

న్నాడు ఒక చార్వాకుడు.

"నేనెప్పుడూ ఆ శివలింగాన్ని ఇక్కడ చూళ్ళేదు. అది కొత్తగా వెలిసిందే!" అన్నాడు పార్కులో రోజూ పడుకునే పనిలేని పాపయ్య.

మునిసిపాలిటీ నించి వచ్చిన పార్కుల ఇన్‌స్పెక్టర్ మహమ్మదాలీ "ఇది చాల ఆశ్చర్యంగా వుంది కన్నయ్యా! ఇక్కడ శివుడు వెలవటమేమిటి, మనల్ని కనికరించటం ఏమిటి. నా ఎదురుగా ఇలాంటి అద్భుతం జరగటం నా అదృష్టం" అన్నాడు.

"ఆలీగారికి శివుడి మీద నమ్మకమెప్పటి నించో" చార్వాకుడు అన్నాడు వెటకారంగా.

ఏమైతేనేం ఆ రోజుతో ఖైదీకన్నయ్య భక్తకన్నయ్య అయ్యాడు. ఆలీగారు మూడేళ్ళలో రిటైర్‌మెంటు తీసుకుని ఎయిర్ కండిషన్డ్ సినిమాహాలు కట్టాడు.

★ ★ ★



కాషాయం స్వామివారు గాలిలో చిటికెలు వేసి విభూతి సృష్టించి అందరికీ పంచి పెడుతున్నారు.

స్వామిగారు మంత్రించి శూన్యంలోంచి తీసి డబ్బున్న వాళ్ళకి మాత్రమే ఇస్తున్న జపాన్ సీకో వాచీలు డబ్బున్నవాళ్ళు కళ్ళకద్దుకుని తీసుకుంటుంటే, డబ్బు లేని వాళ్ళు ఎవరి ముక్కు మీద వాళ్ళ వేళ్ళేసుకుని చూస్తున్నారు.

"కాషాయం స్వామిగారు సాక్షాత్తూ దేవుడు. విష్ణు అవతారం. దేశంలో పెరిగిన అరాచకాన్ని ఆపుచేయటానికే ఆయనీ పాడు భూప్రపంచంలో మళ్ళీ పుట్టవలసి వచ్చింది" అంటున్నాడు ఈపాడు భూప్రపంచంలో పుట్టి రాజకీయాలలో అరాచకానికి ఆజ్యం పోసిన మాజీ మంత్రి శ్రీఅవతారం.

"అవును. మా అమ్మాయికి ఒక కిడ్నీ సరిగ్గా పనిచేయకపోతే ఈయన దగ్గరకు తీసుకువచ్చాం. ఆయన ఒకసారి తాకి కాస్త విభూతి ఇవ్వగానే పూర్తిగా నయమయిపోయింది" అంటున్నాడు ప్రముఖ సైంటిస్టు దేవచంద్రన్.

కాషాయం స్వామిగారు వచ్చి అందర్నీ చూసి, కొంత మంది దగ్గరికి మాత్రమే వెళ్ళి వాళ్ళ తల మీద చేయి వుంచి, ఆశీర్వదించారు.

అక్కడికి తండోపతండాలుగా వచ్చిన ప్రజలు ఒక్కసారిగా జై కాషాయస్వామీ, అని అరిచి ఆ కలియుగ దైవానికి సాష్టాంగ నమస్కారాలు చేశారు.

ఆయన అందర్నీ ఇంకొక్కసారి ఆశీర్వదించి, తన శరీరం మీద నించి వస్తున్న ఫారిన్ పెర్‌ఫ్యూమ్ సుపరిమళాలను ఆఘ్రాణిస్తూ తమ సమశీతోష్ణ మందిరం వేపు సాదరంగా నడిచి వెళ్ళారు.

**సత్యం మందపాటి**

ఆ మట్టినేల మీద పడిన ఆయన పాదాల ముద్రలను భక్త శిఖామణులు కళ్ళకద్దుకున్నారు.

## మనుషులతో దేవుడి బేరం:

"ఎందుకయ్యా నా పేరుతో మీరు చేసే ఈ వ్యాపారాలూ, బేరాలూ, మోసాలూ. నిజంగా నేను ఉన్నాననీ, మీరు పాపాలు చేస్తే నేను శిక్షిస్తాననీ మీకు నమ్మకం వుంటే మీరిలా చేస్తారా? ముందు మీరు మానవత్వం వున్న మనుషులుగా బతకండి. సాటి మనిషిని గౌరవించండి. అప్పుడు ఆలోచిద్దాం నా సంగతి!" అని దేవుడు మనిషితో బేరమాడుతున్నాడు.

★